18వ
సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం,14 ఫిబ్రవరి 2025




# అక్రమంగా గంజాయి తరలింపు

**– పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు**

**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు మరియు కాకినాడ సబ్ డివిజన్ సహాయ పోలీస్ సూపరింటెండెంట్ పాటిల్ దేవరాజ్ మనీష్ పర్యవేక్షణలో, సర్పవరం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.పెద్ది రాజు ఆధ్వర్యంలో, గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు నిర్వహించిన ఆపరేషన్‌లో ముగ్గురిని పట్టుకున్నారు. సర్పవరం పోలీస్ స్టేషన్ సబ్–ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాస్ కుమార్, రమణయ్యపేట పరిసరాల్లోని డంపింగ్ యార్డ్ వద్ద గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వలస గిరిధర్, మీశాల వివేక్ మరియు మరొక సిసిఎల్ కలిసి ధారకొండ, అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి గంజాయిని తెచ్చుకుని, కాకినాడలో అధిక ధరకు విక్రయించేందుకు ప్రణాళిక రూపొందించారు. అయితే, గంజాయి తరలిస్తున్న క్రమంలో పట్టుబడ్డారు. ఈ కేసులో నిందితులు 6 కిలోలు 200 గ్రాముల గంజాయిని అక్రమంగా స్వాధీనం చేసుకుని, విక్రయించేందుకు, రవాణా చేసేందుకు ప్రణాళిక రచించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ సంఘటన 13-02-2025 తేదీ ఉదయం 8:00 గంటలకు, కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట గ్రామానికి సమీపంలోని డ్రైనేజ్ కాలువ బండ వద్ద చోటుచేసుకుంది. కేసు అదే రోజు ఉదయం 11:30 గంటలకు నమోదు చేయబడింది. ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం నిందితులపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుని రిమాండ్‌కు పంపడం జరిగింది.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సమగ్ర ఏర్పాట్లు

**– జిల్లా కలెక్టర్ షణ్మోహన్**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** తూర్పు, పశ్చిమ గోదావరి శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలియజేశారు.గురువారం మధ్యాహ్నం ఏలూరు కలెక్టరేట్ నుండి తూర్పు, పశ్చిమ గోదావరి శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు,రాష్ట్ర చేనేత,జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, నియోజకవర్గ పరిధిలోని 6జిల్లాల కలెక్టర్లు, ఎస్పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఆయా జిల్లాలో ఈ ఎన్నిక నిర్వహణకు పోలింగ్ అధికారులు, సిబ్బంది, మైక్రో అబ్జర్వర్ల నియామకం, వారికి శిక్షణ, ఎంసిసి అమలు పర్యవేక్షణ అధికారులు, స్క్వాడ్ల నియామకం, బందోబస్తు ఏర్పాట్లు తదితర అంశాలను ఆమె కలెక్టర్లు, ఎస్పిలను అడిగి తెలుసుకున్నారు. కాకినాడ కలక్టరేట్ కోర్టు హాలు నుండి జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, జిల్లా ఎస్పి జి.బిందు మాధవ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లాలో పట్టభద్రుల ఎన్నిక నిర్వహణ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ వివరిస్తూ జిల్లాలోని 2 రెవెన్యూ డివిజన్లు, 21 మండల పరిధిలో 70,540 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 42,463 మంది పురుషులు, 28,072 మంది మహిళలు, 5 గురు ట్రాన్స్ జెండర్లు ఉన్నరని తెలియజేసారు. వీరి కొరకు 96 పోలింగ్ స్టేషన్లు, 2 ఆగ్జలరీ పోలింగ్ స్టేషన్లు వెరసి 98 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో 67 పోలింగ్ కేంద్రాలు కాకినాడ డివిజన్



లోను, 31 కేంద్రాలు పెద్దాపురం డివిజన్ లోను ఉన్నాయని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు 25 శాతం రిజర్వుతో కలిపి 123 మంది పిఓలు, 123 మంది ఏపిఓలు, 246 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని, 123 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని తెలియజేసారు. పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు ఈ నెల 14, 20 తేదిలలోను, ఓపిఓలకు ఈ నెల 21న, మైక్రో అబ్జర్వర్లకు 22వ తేదీన కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ హాలులో శిక్షణ ఏర్పాటు చేసామన్నారు. ఈ నెల 26 కాకినాడ డివిజన్‌కు మెక్లారిన్ హైస్కూల్‌లోను,పెద్దాపురం డివిజన్‌కు పెద్దాపురం ఆర్డిఓ కార్యాలయం లోను ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, 27వ తేదీన కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాలులో రిసెప్షన్ సెంటరు, ఇంటర్మీడియేట్ స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 98 పోలింగ్ కేంద్రాలను 21 జోన్లు, రూట్లుగా విభజించి 21 మంది రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. ఎన్నిక నిర్వహణకు 20 శాతం రిజర్వుతో కలిపి 216 బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయని, 10 శాతం రిజర్వుతో కలిపి 78,100 బ్యాలెట్ పేపర్లు అవసరమని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు పర్యవేక్షణకు మున్సిపల్ కమీషనర్లు,ఎంపిడిఓలతో 29 ఎంసిసి టీములు ఏర్పాటు చేసామని,జడ్‌పి సిఈఓను నోడల్ అధికారిగా నియమించామని చెప్పారు.జిల్లా స్థాయిలో కలెక్టరేట్ లోను, డివిజన్ స్థాయిలో ఆర్డిఓ కార్యాలయాలలోను ఎన్నికల కంట్రోలు రూమ్లు, డిఐపిఆర్ఓ నోడల్ అధికారిగా మీడియా సమాచార కేంద్రం ఏర్పాటు చేసామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాలు నిర్వహించి యంసిసి పటిష్ట అమలుకు సహకారం కోరామని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు, పోలింగ్ టీములకు కనీస సదుపాయాలు ఉండేలా చర్యలు గైకొన్నామని కలెక్టర్ షణ్మోహన్ ఎన్నికల పరిశీలకులకు తెలియజేసారు.జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జి.బిందు మాధవ్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన బందోబస్తు ప్రణాళికతో ఏర్పాటు చేస్తున్నామని, జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు లేవని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు, శివరాత్రి ఏర్పాట్లు ఒకేసారి చేపట్టవలసి ఉన్నందున సిబ్బంది కొరత లేకుండా ఏపిఎస్పి బలగాల సహకారాన్ని తీసుకునేందుకు అనుమతి కోరారు. సమావేశంలో అడిషనల్ ఎస్పి మనీష్ పాటిల్ దేవరాజ్, జిల్లా రెవెన్యూ అధికారి, ఏఆర్ఓ జె.వెంకట్రావు, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.జగన్నాధం పాల్గొన్నారు.


## దండకారణ్యంలో ఆదివాసీలపై కేంద్ర బలగాలు సాగిస్తున్న మారణకాండను ఆపాలి

**– ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి**
**– అటవీ సంపదలను పెట్టుబడిదారులకు కట్టబెట్టే ఆలోచన విరమించుకోవాలి**
**– అడవిపై హక్కు ఆదివాసీలకే కల్పించాలి**
**– వామపక్ష, విప్లవ పార్టీలు, దళిత, ఆదివాసి, ప్రజా సంఘాలు, హక్కుల సంఘాల డిమాండ్**




**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆపరేషన్ కగార్‌కి వ్యతిరేకంగా ఏర్పడిన వామపక్ష, దళిత, ఆదివాసి, హక్కుల సంఘాలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు కాకినాడ జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద గురువారం ఉదయం ధర్నా జరిగింది. ఈ ధర్నాలో సిపిఎం, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలు, ఐఎఫ్టియు, ఏఐకేఎంఎస్ ప్రజా సంఘాలు పాల్గొన్నాయి. ఈ ధర్నాలో సిపిఎం నాయకులు వీరబాబు, ఎంవి రమణ, పద్మ, ఈశ్వరి, రాణి, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు ఎం ఏసు, జి ఆదినారాయణమూర్తి, రాగుల రఘువులు, జి దుర్గారావు, బొడ్డు సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నాలో జె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్ర బలగాలు ఆదివాసీలపై యుద్ధం ప్రకటించాయని, ఆదివాసీలపై మారణకాండను సాగిస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు.అటవీ సంపదలను పెట్టుబడిదారులకు కట్టబెట్ట డానికే ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తుందని విమర్శించారు. మావోయిస్టుల సమస్య శాంతిభద్రతల సమస్య కాదని, అది సామాజిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యం కలదని గుర్తు చేశారు. ఎన్కౌంటర్ల ద్వారా నక్సలైట్ల సమస్యను పరిష్కరించలేరని, పెరుగుతున్న నిరుద్యోగాన్ని, పేదరికాన్ని, అసమానతలను, ప్రజలపై సాగుతున్న దోపిడీ, పీడనలను అంతమొందించకుండా నక్సలైట్ల సమస్య పరిష్కారం కాదని హెచ్చరించారు. మావోయిస్టులు అంతమైనంత మాత్రాన ప్రజల సమస్యలు పోవని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి మరో రూపంలో తమ పోరాటాన్ని ఎక్కుపెడతారని హెచ్చరించారు. విదేశీ సైన్యంతో పోరాడాల్సిన కేంద్ర బలగాలు తన దేశ పౌరులైన ఆదివాసీలపైనే అంతిమయుద్ధం చేయడం గర్హనీయం అన్నారు. మోడీ, అమిత్ షా ల నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం తమ ఫ్యాసిస్ట్ విధానాలతో దేశ ప్రజల పైనే యుద్ధం చేస్తుందని విమర్శించారు. ఆదివాసీలపై యుద్ధం ఆపాలని, కగార్ ఆపరేషన్ నిలిపివేయాలని, అడవిపై ఆదివాసీలకే హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

## బీసీ హాస్టల్ భవనాన్ని కంపోస్ట్ యార్డ్‌గా మారుస్తున్న రాజీవ్ గృకల్ప అపార్ట్మెంట్ వాసులు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట పట్టణంలో ఉన్న బిసి హాస్టల్ ఆవరణ అంతా కంపోస్ట్ యార్డుగా మారుతున్న వైనం ఇది సామర్లకోట పట్నంలోని రాజీవ్ గృహకల్ప చేర్చి బీసీ సంక్షేమ వసతిగృహం నిర్వహించ బడుతున్నది. అయితే రాజీవ్ గృహకల్ప బ్లాక్ 17 సంబంధించిన అపార్ట్మెంట్ నిర్వాసితులు తమకు చెందిన చెత్తను పైనుంచి ప్రక్కనే ఉన్న బీసీ హాస్టల్‌లో వేయడం వల్ల బీసీ వసతిగృహం కంపోస్ట్ యార్డ్‌గా మారుతుంది.

అపార్ట్మెంట్లు సంబం ధించి బ్లాక్ నెంబర్ 17 అపార్ట్మెంట్ నిర్వాసితులు పైనుంచి తమ ఇండ్లలో ఉన్న చెత్తను పక్కనే ఉన్న వసతి గృహంలో ప్రతిరోజు వేయడం వల్ల హాస్టల్ ప్రాంగణం అంతా చెత్తతో నిండిపోతుంది చెత్త తో మహిళల బుతు శ్రావ వ్యర్థములు ఉంటున్నాయని దీని కార ణంగా విష సర్పాల సైతం హాస్టల్ వసతి గృహాల్లోకి ప్రవేశిసు_న్నాయని విద్యార్థులను హడలిపోతున్నారు మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకుని అపార్ట్మెంట్ నివాసితులు చెత్తను వేయకుండా చూడాలని బీసీ హాస్టల్ సంక్షేమ శాఖ అధికారి జయసుందరి మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ సమస్యలు వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్యను వివరణ కోరగా బీసీ హాస్టల్‌లో చెత్తను తొలగించడానికి శుక్రవారం ప్రత్యేకించి శానిటేషన్ సిబ్బంది నీ నియమించి శుభ్రం చేస్తామని తెలిపారు. అదే విధంగా అపార్ట్మెంట్ నివాసితులకు చెత్తను వేయకుండా తగిన హెచ్చరికలు జారీ చేస్తామని సందర్భంగా తెలిపారు.

## వీఆర్వోల వాఖ్యలకు స్పందించాలని కోరుతూ సిఇఓ, ఆర్డీఓలకు వినతిపత్రాలు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, ఆర్.బి.కొత్తూరు గ్రామంలో సచివాలయల పరిశీలనలో భాగంగా ఎంపిడిఓ డి.శ్రీలలిత బుధవారం వెళ్ళి పరిశీలించగా, గ్రామ వీఆర్వో అందుబాటులో లేనందున సర్వేలు పనితీరుపై వెంటనే స్పందించాలని సంబంధిత వీఆర్వోలను ఆమె ఫోన్ ద్వారా సంప్రదించగా, నేను సమావేశంలో ఉన్నాను అని ఫోన్ పెట్టేయడంతో సచివాలయానికి, వీఆర్వోలకు సంబంధం లేదా అని ఎంపిడిఓ అడుగగా, సంబంధిత వీఆర్వో, మండలంలోని వీఆర్వోలందరూ బుధవారం సాయంత్రం ధర్నా నిర్వహించి, ఎంపిడిఓ సంజాయిషీ ఇవ్వాలని వారు కోరడం ఎంతవరకు సమంజసమని, పెద్దాపురం మండలంలోని పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది గురువారం జిల్లా పరిషత్ సిఇఓ వి.వి.వి.లక్ష్మణరావుకు పెద్దాపురం డిఎల్‌డిఓ కె.ఎన్.వి.ప్రసాద్ సమక్షంలో ఎంపిడిఓ డి.శ్రీలలిత ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. దీనిలో భాగంగా పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణికి ఇదే విషయమై వారందరూ వినతిపత్రం అందజేయడం జరిగింది. జిల్లా పరిషత్ సిఇఓ వి.వి.వి.లక్ష్మణరావు, ఆర్డీఓ కె.శ్రీరమణిలు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విధులు నిర్వహించడం ప్రతీ ఉద్యోగి బాధ్యత అని ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు.



# బర్డ్ ఫ్లూపై భయం లేదు

**– బర్డ్ ఫ్లూ(ఏవియన్ ఇన్ఫ్లుఎంజా)పై వదంతులు, అపోహలు నమ్మవద్దు**
**– బర్డ్ ఫ్లూ(ఏవియన్ ఇన్ఫ్లుఎంజా) పక్షులకు మాత్రమే వచ్చే వ్యాధి**
**– 18 నేసల్ స్వాబ్ నమూనా పరీక్షలు ఫలితాలలో వ్యాధి నిర్ధారణ లేదు**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ఉన్నతి స్థాయి అధికారుల సూచనల మేరకు జిల్లాలో వస్తున్న లిబర్డ్ ఫ్లూ (ఏవియన్ ఇన్ఫ్లుఎంజా) నియంత్రణపై ప్రజలందరికీ అవగాహన కల్పించామని, ఏ ఒక్కరు భయపడ వలసినఅవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలో బర్డ్ ఫ్లూ(ఏవియన్ ఇన్ఫ్లుఎంజా)కోళ్లకు వచ్చే వ్యాధి అని తగిన జాగ్రత్తలు పాటిస్తే వైరస్ సోకదని, ప్రజలు ఆందోళన పడవలసిన పని లేదన్నారు. బర్డ్ ఫ్లూ ఉన్న ప్రాంతాల వారు తగు జాగ్రత్తలు పాటించడం అవసరం, ఆరోగ్యంగా ఉండటానికి మాత్రమే కాకుండా, వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడానికి కూడా ఈ జాగ్రత్తలు అవసరం అని తెలియచేశారు. ప్రజలు అప్రమత్తం గా ఉండాలని ఏదైనా జ్వరం, జలుబు, తలపోటు, ఒళ్ళునొప్పులు , కండరాల నొప్పులు వంటి లక్షణములు వచ్చిన వెంటనే వైద్య సిబ్బంది కి తెలియ చేయాలన్నారు. పెరవలి, ఉండ్రాజవరం, నల్లజర్ల, చాగల్లు, నిడదవోలు, సీతానగరం మండలాలలో 64 టీమ్స్ ద్వారా 22902 గృహాలను సందర్శించి అందులో 87724 జనాలకు రోగలక్షణాలపై సర్వే చేసి ఎవరికి లక్షణాలు లేవని తెలియ చేశారు. ప్రజలలో ఉన్న అపోహలు తొలగిస్తున్నారని తెలియచేసారు.

కోడిగుడ్లు, చికెన్ వినియోగం, రవాణ చేయడం , శుభ్రం చేయడం మరియు వంటకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన తెలియ చేశారు.

- చికెన్ పూర్తిగా వండిన తర్వాత మాత్రమే తినాలి (75డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో ఉడికించాలి).
- ముడి మాంసం తినకూడదు, హాఫ్-బాయిల్ చేసిన గుడ్లు తినకూడదు.
- కోడిగుడ్లు మరియు చికెన్ చేతితో తాకినా తర్వాత బాగా చేతులు కడుక్కోవాలి.
- చికెన్ మరియు గుడ్లను వేరు వేరు గా నిల్వ చేయాలి, ఇతర ఆహార పదార్థాలతో కలపకూడదు.
- కోళ్లు మరణించి ఉంటే వాటిని తగిన జాగ్రత్తగా తీసుకొని నిర్మూలన చేయాలన్నారు.
- బర్డ్ ఫ్లూ ప్రబలిన ప్రాంతాల నుండి చికెన్, గుడ్ల రవాణా చేయకుండా ఉండాలి.

వదంతులను నమ్మవద్దు. సోషల్ మీడియా ద్వారా గాని ,ఇతర మార్గాలు ద్వారా వచ్చే అపోహలను ఎవరు నమ్మవద్దు అని ఆరోగ్య సిబ్బందిని గాని, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని సంప్రదించాలని తెలియజేశారు.

- వ్యాధి వ్యాప్తి నేపథ్యంలో, వైద్య ఆరోగ్య శాఖ ఈ క్రింది చర్యలను చేపట్టింది:

డోర్-టు-డోర్ నిఘా :- 10-కిలోమీటర్ల పరిధిలో, మా బృందాలు కింది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కవర్ చేశాయి. కానూరు, సమిశ్రగూడెం, మార్కొండపాడు, పెరవలి, ఉండ్రాజువరం, వెలివెన్ను మరియు సీతానగరం, 34 గ్రామాలలో విస్తరించి ఉన్నాయి.

రోగలక్షణ కేసులను గుర్తించడం కోసం ఇంటింటికీ నిఘా నిర్వహించడానికి 64 బృందాలను నియమించడం జరిగింది.

వైద్య శిబిరాలు:- అవసరమైన వారికి వైద్యం అందించేందుకు ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు.

-ఏవియన్ ఇన్ఫ్లుఎంజాపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో నిఘా సమయంలో ఆరోగ్య విద్యా సదస్సులు నిర్వహించడం జరుగుతున్నాయని తెలియ చేశారు. ఇటువంటి సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా జ్వరం, జలుబు, తలపోటు, ఒళ్ళునొప్పులు వంటి లక్షణములు వచ్చిన వెంటనే వైద్య సిబ్బంది కి తెలియ చేయాలనీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆ ప్రకటనలో తెలియజేశారు.

## అవార్డు అందుకున్న పరిశ్రమనే అవస్థలు పెడుతున్న ట్రాన్స్కో విద్యుత్తు సంస్థ

**– అన్నం పెట్టే సంస్థకే సున్నం.. వేలాదిమంది ఉపాధి ప్రశ్నార్థకం**
**– ఆదాయవనరుగా కొత్తస్తంభాలు,లైన్లు. లివినియోగదారులకు అవస్థలు**
**– శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్**



**పెరవలి, మేజర్ న్యూస్ :** విద్యుత్ ట్రాన్స్కో సిబ్బందికి కొత్త స్తంభాలు, కొత్త లైన్లు వేయటం లో ఉన్న శ్రద్ధ తమ వద్ద ఉన్న విలువైన వినియోగదారులను కాపాడటంలో లేదని శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. ఫిబ్రవరి 13వ తేదీ గురువారం మేజర్ న్యూస్ తో మాట్లాడుతూ ట్రాన్స్కో సిబ్బంది నిర్లక్ష ధోరణితో పరిశ్రమలకు, ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని ట్రాన్స్కోఅధికారుల అలసత్వంతో భారీ పరిశ్రమలను రోజులవారీగా అంధకారంలో పెట్టి, వేలాది మంది ఉపాధికి, విద్యుత్ శాఖకు వచ్చే ఆదాయానికి నష్టం కలుగ చేస్తున్నారు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి గ్రామంలోఉన్న రవళి స్పిన్నర్స్ , టెక్స్టైల్ రంగంలో ఉన్న ఒక భారీ కర్మాగారం.గత నెలలో ఉత్తమ విద్యుత్ వాడకం దారుగా రాష్ట్ర ప్రభుత్వ అవార్డు పొందిన సంస్థ దానికున్న డెడికేటెడ్ 132 కె.వి.ఏ సబ్ స్టేషన్ కు వచ్చే లైన్ 10 కేఎం లోపు కట్ అయితే 24 గంటలు అయినా సమస్యను తెలుసుకోలేకపోయారంటే ట్రాన్స్కో వారి పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థంఅవుతుంది. ఈ పరిశ్రమ యాజమాన్యం నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం 10 కోట్లు ఖర్చు చేసినా రెండు వైపుల నుండి విద్యుత్ సరఫరాఅంతరాయాన్ని నివారించలేకపోతున్నారు. నెలకు మూడు కోట్లు కరంటు బిల్లు కట్టే ఈ సంస్థకు, తనకు కేటాయించిన పూర్తి విద్యుత్ సరఫరా చేయడం లేదని స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మందికి అన్నం పెట్టే సంస్థకు సున్నం పెట్టే విధంగా అధికారులు తీరు ఉందని ఆయన ఆక్షేపించారు. కొన్నిచోట్ల అవసరం ఉన్నా లేకపోయినా కొత్త స్తంభాలు వేయటం, లైన్ల లాగటం వంటి ఆదాయ మార్గాలు ఉండే పనులపై ఉన్న శ్రద్ధ తమ వద్ద ఉన్న విలువైన వినియోగదారున్ని కాపాడే విషయంలో లేకపోవడం విచారకరమన్నారు.ట్రాన్స్కో సిబ్బంది అలసత్వాన్ని వీడాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో తాను స్వయాన విద్యుత్ శాఖ మంత్రికితెలియపర్చినా,ఉన్నత అధికారులకు తెలిపినా పని జరగడంలేదని,ఇలావుంటే కొత్త పరిశ్రమలు ఎలా వస్తాయని రవీంద్రనాథ్ ప్రశ్నించారు.

# 5వేల మందికి భారీ అన్నదానం




**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** సామర్లకోట విఘ్నేశ్వర థియేటర్ వద్ద వేణుగోపాల స్వామిని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు దర్శించుకుని పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయం వద్ద వారు అన్నధాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించగా ఎమ్మెల్యే, కుడా చైర్మన్ లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేపట్టిన అన్నదాన కార్యక్రమం లో సుమారు 5వేల మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షులు అడబాల కుమారస్వామి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, భీమేశ్వరాలయ మాజీ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీశ్ మోహన్, క్రీడా విభాగం కన్వీనర్ నిమ్మకాయల కిరణ్, కౌన్సిలర్ బలుసు వాసు, యువత అధ్యక్షులు వల్లూరి దొరబాబు, జనసేన పట్టణ అధ్యక్షులు సరోజ వాసు, నియోజకవర్గ సమన్వయ కర్త మంచెం సాయి, కూటమి నాయకులు, ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో స్టెమీ గుండెకు భరోసా



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో స్టెమీ గుండెకు భరోసా కార్యక్రమం వైద్యాధికారుల ఆదేశాల మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా గుండెపోటుకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, మొదటి గంటలోనే రూ.45,000 విలువైన టెనెక్టెప్లెస్ ఇంజక్షన్‌ను ఉచితంగా అందజేయడం జరుగుతుందని, ఆసుపత్రి వైద్యులు డా.మానస (స్టెమీ నోడల్ ఆఫీసర్) తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండెపోటు లక్షణాలు సంబంధించి, ఛాతి నెప్పి మరియు ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం మరియు గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే 108కి ఫోన్ చేస్తే వెంటనే దగ్గరలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం గాని, ఏరియా ఆసుపత్రికి గాని, జిల్లా ఆసుపత్రికి గాని తీసుకువెళ్ళడం జరుగుతుందని, మొదటి గంట అత్యంత కీలకమని, వెంటనే చర్యలు తీసుకుని ప్రాణాలు కాపాడుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ కమలకుమారి, హెడ్ సిస్టర్ రమాదేవి, సిబ్బంది రాజా, తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ ద్వారా కత్తెరి పురుగుకు అగ్ని అస్త్రం



**పెరవలి, మేజర్ న్యూస్ :** డ్రోన్ ద్వారా అజ్ఞతరందశ, పత్రిసాయం, ఇంగువలు, కలిపి డ్రోన్ ద్వారా పిచికారి చేయటం వలన మొక్కజొన్నపై కత్తెర పురుగులు నశిస్తాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నిడదవోలు నూర్యనారాయణ, గుడాల వెంకటేశ్వర్లు, కన్నాజి వెంకటకృష్ణ, కుడిపూడి భవాని, సరిపల్లి జ్యోతిలక్ష్మి, లు మేజర్ న్యూస్ కు తెలియజేశారు. ఫిబ్రవరి 13వ తేదీ గురువారం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల గ్రామంలో 30 ఎకరాల వరి పంట చేలకు ఆరు ఎకరాల మొక్క జొన్న తోటలకు డ్రోన్ ద్వారా ద్రవకాలు పిచికారి చేస్తున్నట్లు వారు తెలియజేశారు. దీనివల్ల రైతుకు ఖర్చులు పరిమితంగా అవుతాయని వ్యవసాయ కూలీల కొరత కూడా అధిగమించవచ్చని వారన్నారు.

సూర్య
www.suryaa.com
తూర్పుగోదావరి
శుక్రవారం,
14 ఫిబ్రవరి 2025
2

## రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

**- తక్షణమే స్పందించి ఆసుపత్రికి తరలించిన ఎస్సై మౌనిక**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం - సామర్లకోట రోడ్డులో గురువారం స్థానిక పెట్రోల్ బంక్ వద్ద రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాల వడంతో సంఘటన స్థలానికి హుటాహుటిన పెద్దాపురం ఎస్సై వి.మౌనిక తన సిబ్బందితో చేరుకుని, 108 వాహనం అందుబాటులో లేనందున ఆటో మరియు పోలీస్ వాహనంలో క్షతగాత్రులను ప్రాధమిక చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భవిత కేంద్రంలో కంటి పరీక్షలు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో మహాత్మా గాంధీ మున్సిపల్ ప్రైమరీ స్కూల్ నందు ఉన్న భవిత కేంద్రం నందు శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి వారి సారధ్యంలో బాలనేత్ర బంధు కార్యక్రమంలో భాగంగా దివ్యాంగ పిల్లలకు మరియు సాధారణ పిల్లలకు ఉచిత కంటి వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మండల విద్యాశాఖాధికారి-2 వి.ఆర్.కె.చౌదరి పాల్గొని మాట్లాడుతూ కిరణ్ కంటి ఆసుపత్రి యాజమాన్యం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో శుభపరిణామమని తెలిపారు. దీనిలో భాగంగా పిల్లలకు స్క్రీనింగ్ టెస్ట్, ఐ డ్రాప్స్, సర్జరికి అవసరమైన వారిని కాకినాడ శ్రీకిరణ్ కంటి ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగింది. దివ్యాంగ పిల్లలు 30 మంది, మహాత్మా గాంధీ స్కూల్ పిల్లలు 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి డా.ఎస్.పూజారెడ్డి, వై.శివగణేష్, పి.దుర్గాప్రసాద్, బి.ప్రశాంత్, జి.ఉమ మహేశ్వరరావు, భవిత సిబ్బంది బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

# మెగా సాఫ్ట్ వేర్ జాబ్ మేళాకు విశేష స్పందన

**- భారీగా తరలివచ్చిన నిరుద్యోగులు**
**- ఇంటర్వ్యూలో 225 మంది ఎంపిక**
**- త్వరలో నియామక పత్రాలు ఇస్తాం**
**- ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఐటీ కంపెనీల ప్రతినిధులు**

**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** దేశంలోని ప్రముఖ ఐటీ కంపెనీలో నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" ఆధ్వర్యంలో రామచంద్రపురంలోని వి.ఎస్.ఎం కళాశాలలో ఏర్పాటుచేసిన మెగా సాఫ్ట్ వేర్ జాబ్ మేళాకు అత్యధిక సంఖ్యలో నిరుద్యోగులు హాజరయ్యారు. ఉదయం 9 గంటలకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం జాబ్ మేళాను లాంఛనంగా ప్రారంభించారు. ఈ జాబ్ మేళాలో దేశవ్యాప్తంగా 23 ఎంఎన్‌సి ఐటీ దిగ్గజ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత ఆన్లైన్ రిజిస్ట్రేషన్ పొందిన1300 మందికి బ్రాంచ్ ల వారిగా ఇంటర్వ్యూలు నిర్వహించి, 225 మందిని ఎంపిక చేశారు. ఈ మెగా జాబ్ మేళాకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి సైతం నిరుద్యోగులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో రికార్డు స్థాయిలో ప్రముఖ 23 ఐటీ కంపెనీలు పాల్గొని 225 మంది ఐటీ ఉద్యోగాలకు




ఎంపిక కావటం హర్ష నీయం. అత్యధికంగా ఒక కంపెనీ 16 మందిని ఎంపిక చేసి రూ.8 నుంచి 12 లక్షల ప్యాకేజీ ఇచ్చిందన్నారు. మిగిలిన కంపెనీలు కూడా రూ.3 నుంచి 9 లక్షల ప్యాకేజీ అందిస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో, ముఖ్యంగా రామచంద్రపురం నియోజవర్గంలో నిరుద్యోగ సమస్యను పూర్తిగా రూపుమాపాలనే తన కుమారుని ఆశయం మేరకు ఈ మెగా సాఫ్ట్‌వేర్ జాబ్ మేళాను నిర్వహించామన్నారు. ఎన్నో కష్టాలను అధిగమించి ఇంజనీరింగ్ పూర్తి చేసిన నిరుపేద కుటుంబాల అవస్థలు చూసి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో ఈ జాబ్ మేళా నిర్వహించామన్నారు. ఇవి కాకుండా మరో రెండు కంపెనీలతో ఒప్పందం జరిగిందని, అలాగే త్వరలో ఒక డ్రోన్ కంపెనీ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. చదువుకున్న యువత పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, ఐటీ రంగంలో ఉద్యోగం చేయాలనుకున్న వారికి ఇదొక సువర్ణ అవకాశంగా అభివర్ణించారు. ఈ మెగా జాబ్ మేళా ఏర్పాటు కోసం తన కుమార్తె, సాఫ్ట్ వేర్ నిపుణురాలు శ్రీ సత్య కృషిని ఈ సందర్భంగా సత్యం గారు ప్రశంసించారు. తమ ఆహ్వానం మేరకు రామచంద్రపురం తరలివచ్చిన ఐటి దిగ్గజ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు, టెన్త్,ఇంటర్, డిగ్రీ జాబ్ మేళాలు నిర్వహించి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, కోవల్సెన్ డిజిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ పొన్నగంటి, వివిధ ఐటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సేవలను కొనియాడారు.

### శ్రీ మరిడమ్మ అమ్మవార్కి వెండి కుంకుమ భరిణి బహుకరణ



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు గురువారం కాకినాడ జిల్లా, తుని పట్టణానికి చెందిన దాడిశెట్టి శ్రీదేవి, శివకోటి దంపతులు (292.600 మి.గ్రా. కెంపు ఎర్ర) వెండి కుంకుమ భరిణి అమ్మవార్కి బహుకరించినట్లు దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ మరిడమ్మ అమ్మవార్కి పంచామృతాభిషేకం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు గురువారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవార్కి మండపంలో జన్మ నక్షత్రం మఖ నక్షత్రం సందర్భంగా పంచామృతాభిషేకం, పసుపు, కుంకుమ, చందనం, విభూదిలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించి, అనంతరం స్వర్ణ, రజతాలతో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం పులిహోర ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.


### క్యాన్సర్ ఆసుపత్రి ఆంకాలజీ విభాగం ఏర్పాటుకు అనువైన ప్రదేశాల పరిశీలన





**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడలో నూతనంగా నిర్మించనున్న క్యాన్సర్ ఆసుపత్రి ఆంకాలజీ విభాగం ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గురువారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణం పక్కన ఉన్న మున్సిపల్ అతిథి గృహం స్థలాన్ని జిల్లా కలెక్టర్..జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్య కుమారి, ఏపీఎంఎస్ఐడిసి ఇతర ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కాకినాడ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో (జీపీటీ) నిర్మించిన 500 పడకల నూతన సమీకృత ఆయుర్వేద ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ షణ్మోహన్..ఆయుష్ వైద్య అధికారులు, ఏపీఎంఎస్ఐడిసి, జీపీటీ కళాశాల సిబ్బందితో కలిసి పరిశీలించారు. చివరి దశకు చేరుకున్న సమీకృత ఆయుర్వేద ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులు, ఆసుపత్రికి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలం, క్యాన్సర్ ఆసుపత్రికి అనువైన ప్రదేశాలను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా మ్యాప్‌ల ద్వారా పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట కాకినాడ అర్బన్ తహశీల్దార్ జితేంద్ర, ఏపీఎంఎస్ఐడిసి ఈఈ సీహెచ్ రత్నరాజు, డీఈ ఎన్ఎస్. చక్రవర్తి, ఆయుష్ వైద్య అధికారులు డా. మహమ్మద్ షాజన్ అలీ, కె.శ్రీనివాసు, జీపీటీ ఇన్చార్జి మున్సిపల్ డా. సంజయ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ఆదిత్యలో ఘనంగా సరోజినీ నాయుడు జయంతి వేడుకలు



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఆదిత్య డిగ్రీ కళాశాల అనుబంధ సంస్థ ఆదిత్య స్కూల్ అఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో సరోజిని నాయుడు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు, స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ప్రిన్సిపాల్ డి. బ్యూలా, వైస్ ప్రిన్సిపల్ జి సత్య పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బిఈవిఎల్ నాయుడు మాట్లాడుతూ సరోజినీ నాయుడు 1879 ఫిబ్రవరి 13న హైదరాబాదులో డాక్టర్ అఘోరనాథ్ చటోపాధ్యాయ, వరద సుందరులకు జన్మించిందని, భారత కోకిల, స్వతంత్ర సమరయోధురాలని, అఖిల భారత జాతీయ కాంగ్రెస్ తొలి మహిళ అధ్యక్షురాలని, స్వతంత్ర భారతదేశపు తొలి మహిళా గవర్నర్ అని, దేశ బానిసత్వం నుంచి నియంత సంకెళ్ళ నుండి విముక్తి పొందడంలో కృషి చేసిన వారిలో సరోజినీ నాయుడు ఒకరని కొనియాడినారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డి.బ్యూలా మాట్లాడుతూ సరోజినీ నాయుడు తనే దేశం దేశమే తనుగా భావించి దేశ సేవ కోసం పరితపించిన మహాత్మురాలని, 1964 సంవత్సరంలో సరోజినీ నాయుడు పేరు మీద తపాలా బిళ్ళ ముద్రించారని, సరోజినీ నాయుడు దేశానికి చేసిన సేవలు దృష్టిలో ఉంచుకొని ఆమెకు ఉత్తర ప్రదేశ్ గవర్నర్ పదవి ఇచ్చి భారత ప్రభుత్వం సత్కరించిందని, కులాంతర వివాహం చేసుకున్న తొలి మహిళగా అని అభివర్ణించారు. 70వ యేటా 1949 మార్చి 2న లక్నో లక్నోలో కన్నుమూశారని తెలిపారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ జయంతి వేడుకలు లైబ్రేరియన్ జి.నేరెళ్లరెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

## ఆదిత్యలో జాతీయ మహిళా దినోత్సవం







**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాలలో ది.13-02-2025న 'జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా సరోజినీ నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ ఫిబ్రవరి 13వ తారీఖు 1879వ సంవత్సరంలో హైదరాబాద్‌లో ఆమె జన్మించారు. అదే రోజుని మనం జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటామని ఆయన తెలిపారు. మహిళల సాధికారత, సమస్యలపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఆ రోజును జరుపుకుంటామని ఆయన తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ 'నైటింగేల్ ఆఫ్ ఇండియ' భారత కోకిలగా పేరొందిన సరోజినీ నాయుడు జన్మదినాన్ని 'జాతీయ మహిళా దినోత్సవం'గా జరుపుకుంటామని ఆమె తెలిపారు. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఎమ్ఎస్ఎన్ క్యాంపస్ నందు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న జి.రాధమాధవి విచ్చేసారని ఆమె తెలిపారు. ముఖ్య అతిధి జి.రాధమాధవి మాట్లాడుతూ సరోజినీ నాయుడు గవర్నర్‌గా భాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా ఆమె చరిత్రకెక్కారు. అలాగే సాహిత్యరంగంలో 'ఒర్డ్ ఆఫ్ ది టైం, ది బ్రోకెన్ వింగ్స్' లాంటి రచనలు ఎందరన్నో ఆకట్టుకున్నాయి అని అన్నారు. 1949 మార్చి 2న లక్నోలోని కార్యాలయంలో పనిచేస్తూ గుండెపోటుతో కన్నుమూశారని అన్నారు.ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్. ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ పి.సురేఖ దేవి, ఎమ్. శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నీరజ, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు మరియు అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రజలకు రెవెన్యూ సేవలు సకాలంలో అందించాలి- సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం వివిధ రకాల రెవిన్యూ సేవలు ప్రజలకు సకాలంలో అందించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్. కల్ప శ్రీ పేర్కొన్నారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో ఏడు మండలాల తహశీల్దార్లు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, మండల సర్వేయర్లు, సచివాలయాలకు చెందిన సర్వేయర్లు, వీఆర్ఓలతో గురువారం సాయంత్రం సబ్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల పరిధిలోని అన్ని గ్రామాలలో గిరిజనులకు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం వివిధ రకాల రెవెన్యూ సేవలు సకాలంలో అందించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కుటుంబ యాజమాని పేరు మీద ఉన్న భూములకు దరఖాస్తు సమర్పించిన వెంటనే నిబంధనలు ప్రకారం మ్యుటేషన్ చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం రేషన్ కార్డు లబ్ధిదారులకు సకాలంలో రేషన్ అందజేయాలన్నారు. తహశీల్దార్, వీఆర్వోలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, అదేవిధంగా వీఆర్వోలు, తహశీల్దార్ లు ఏ గ్రామాల్లో తిరుగుతున్నది ఒక షెడ్యూల్ ఏర్పాటు చేసుకోవాలని, అదేవిధంగా వారు ఎక్కడ పర్యటనలు చేయుచున్నది రాష్ట్రస్థాయిలో పరిశీలిస్తున్నారని ఆమె అన్నారు. ఏజెన్సీలో వివిధ రకాల సర్టిఫికెట్లు మంజూరు చేయుటకు పూర్తిస్థాయిలో పరిశీలించి, అర్హులైన వారికి సర్టిఫికెట్లు మంజూరు చేయాలని ఆమె అన్నారు. ఏజెన్సీలో ఉమ్మడి భూములు మ్యూటిషన్‌కు ఎన్ని దరఖాస్తులు వచ్చినవి, అదేవిధంగా ఎన్ని పరిష్కరించినది మండలాల వారిగా సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఆరా తీశారు. దేవీపట్నం మండలంలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కి సంబంధించిన వివరాలు పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికలు సమర్పించాలన్నారు. నేషనల్ హైవేకు సంబంధించిన వివరాలు పూర్తిస్థాయిలో పరిశీలించి సమర్పించాలని అన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్లు పి.రామకృష్ణ, సిహెచ్ శ్రీనివాసరావు, కె. సత్యనారాయణ, కె. సూర్యనారాయణ, వేణుగోపాల్, బాలాజీ, డివిజనల్ సివిల్ సప్లై అధికారి విజయ భాస్కర్, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు, ఈడీఎం నగేష్, అన్ని మండలాల రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, మండల సర్వేలు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

## శృంగవరంలో అగ్ని ప్రమాదం




**రౌతులపూడి, మేజర్ న్యూస్ :** రౌతులపూడి మండలం శృంగవరం గ్రామం బీసీ కాలనీలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది.బర్ల యేసు రత్నం,పెద్దాపురం అను వారు పిల్లలతో7 తాటా కు ఇంట్లో నివసిస్తున్నారు.వీరికి నలుగురు ఆడపిల్లలు.గురువారం షార్ట్ సర్క్యూట్‌తో అకస్మాత్తుగా మంటలు రేగి సర్వం కాలి బూడిద అయ్యాయి. సుమారు నాలుగు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్ని%శీ%దని బాధితులు తెలిపారు. విషయం తెలిసికున్న రెవెన్యూ అధికారులు శివశంకర్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను బాధితులను,పెద్దలను వివరాలను అడిగి తెలుసుకున్నారు.దీనిపై ఉన్నతాధికారులకు సమర్పించి ప్రభుత్వం నుండి అందాల్సిన ఆర్థిక సాయం వచ్చేటట్లుగా సహకరిస్తాం అన్నారు.బాధితులకు బియ్యం పప్పులు తాత్కాలిక ఆర్థిక సాయం పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు లొండ దేవుళ్ళు,బొంగు నాని, వాసం బాబ్జి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## దశరథ శ్రీరాములు కుటుంబాన్ని పరామర్శించిన జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట నియోజకవర్గం జగ్గంపేట మండలం వెంగయ్యమ్మపురం గ్రామానికి చెందిన దశరథ శ్రీరాములు ఇటీవల స్వర్గస్తులైనారని తెలియడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ తెలిపారు. పరామర్శించిన వారిలోమరిసే రామకృష్ణ , అన్నాను దుర్గాప్రసాద్, కొట్టేడి నాగేశ్వరరావు, మరిశే శ్రీను, దశరథ అరుణ్, మాదారపు వీరబాబు, రాజనాల శ్రీను,గోకేడ ప్రసాద్, గోకేడ రమణ తదితరులు జనసైనికులు పాల్గొన్నారు

## ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా అమలు చేయాలి..


**- తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజవకర్గ ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత**

**ఏలూరు, మేజర్ న్యూస్ :** ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలుచేయాలని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజవకర్గ ఎన్నికల పరిశీలకురాలు కె. సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికపై ఏలూరు కలెక్టరేట్ వి.సి. హాలునుంచి ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, తదితరులతో ఎన్నికల పరిశీలకురాలు కె. సునీత సమీక్షించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.పీ.ఎస్.కిషోర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో పట్టభద్రుల నియోజవకర్గ పరిధిలో 3,14,984 మంది ఓటర్లు ఉన్నారని, దానికి సంబంధించి 456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఈ ఎన్నికలకు 70 జోన్లు ఏర్పాటు చేయగా అందుకు సంబంధించి 70 జోనల్ అధికారులను, 95 మంది రూట్ ఆఫీసర్లను నియమించడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎంసిసి ఖచ్చితంగా అమలు చేయాలన్నారు.పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించుకోవాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలన్నారు. జిల్లా, డివిజనల్ స్థాయిలో కంట్రోల్ రూం లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్నికల రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు పటిష్టంగా ఉండాలన్నారు. ఏలూరులో కౌంటింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ అనంతరం పకడ్బందీ ఏర్పాట్లతో, పటిష్ట బంధోబస్తుతో ఏలూరులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకి చేర్చాలన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లకు మొదటి విడత పోలింగ్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సమావేశంలో ఆయా జిల్లాల నుండి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు,సంబంధిత అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొనగా ఏలూరు నుంచి సహాయ రిటర్నింగ్ అధికారి వి. విశ్వేశ్వరరావు, జెడ్పి సిఇఓ కె.సుబ్బారావు, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, పలువురు నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు శివకేశవుల ప్రతిష్ట మహోత్సవంలో మొదటి రోజు విశేష పూజలు యజ్ఞాది యాగాలు నిర్వహణ



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నది తీరాన వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి శివకేశవులు కొలువైన క్షేత్రంలో జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ మణి దంపతులు, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతులు, తోట సర్వారాయుడు సునీత దంపతులచే 13వ తేదీ నుండి 17వ తేదీ వరకు జరుగుతున్న శివ కేశవుల ప్రతిష్ట మహోత్సవం లో భాగంగా మొదటిరోజు వెంకటేశ్వర స్వామి వారికి శ్రీ వైఖానస భగవత్ శాస్త్ర ప్రకారముగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాసన, అకల్మష హోమం, నవగ్రహారాధన ,యాగశాల వాస్తుశుద్ధి, ఆచార్యాది ఋత్విక్ వరుణ దీక్షాధారణ, అంకురార్పణ, యాగశాల ప్రదేశం జరిగాయి. పరమశివుడికి ఉదయం వినాయక పూజ, పుణ్యాహవాచనం, మండప పూజలు, శ్రీ రుద్రఅభిషేకం, రుద్ర సహిత చండీ హోమం, నీరాజనా మంత్రపుష్పాలు సాయంత్రం రుద్రహోమం, చండిహోమం, దేవతాహోమాలు, నిరంజనమంత్రపుష్పాలు దర్బారుసేవ, బ్రహ్మశ్రీ శ్రీమాన్ పాణింగపల్లి సత్య పవన్ కుమార్ ఆచార్యులు, కొట్ర వెంకట సూర్య కామేశ్వర శర్మ పండితుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఫిబ్రవరి 17వ తేదీ 11: 55 నిమిషాలకు శివకేశవుల ప్రతిష్టా మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల అనీష్ నెహ్రూ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శివ కేశవులను దర్శించుకుని తీర్థ ప్రసాదాల స్వీకరించారు.

సూర్య
తూర్పుగోదావరి
శుక్రవారం, 14 ఫిబ్రవరి 2025


## లుకేమియా విద్యార్థికి 'చేయూత' రవి రూ.లక్ష ఆర్థిక సహాయం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జగన్నాథపురంకి చెందిన 10వ తరగతి విద్యార్థి లుకేమియా వ్యాధితో బాధపడుతున్న సందర్భంగా వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించిన చేయూత సంస్థ ప్రతినిధి రవికుమార్‌ను, వారి బృందాన్ని కాకినాడ సిటి శాసనసభ్యులు వనమాడి కొండబాబు, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తదితరులు అభినందించారు. గురువారం ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, పలువురు అధికారుల సమక్షంలో విద్యార్థి తండ్రికి అందచేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ లుకేమియా విద్యార్థికి వైద్యసేవల నిమిత్తం ఆర్థిక సహాయం చేయాలన్న విజ్ఞప్తికి సుమారు 203 మంది వెంటనే స్పందించి ఈ మొత్తాన్ని అందించారని చెప్పారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా చేయూత సంస్థ అధ్యక్షురాలు సురభి శారద, సైన్స్ విభాగ అధ్యక్షులు వినీల్, సభ్యులు చింతా పవన్ కళ్యాణ్, శ్రీమాన్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్మోహిని కేశవస్వామి అన్నదాన పథకానికి విరాళాలు




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి అన్నదాన పథకానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన ఏలేశ్వరపు శివకుమార్ శర్మ, మాధవి దంపతులు రూ.10,116లు; గుంటూరు కు చెందిన మెండుగుల నాగభూషణ రెడ్డి, విజయలక్ష్మి దంపతులు రూ.5,116లు విరాళంగా అందించారు. ఆలయ అర్చక బృందం దాతలకు ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి స్వామివారి చిత్రపటం అందించారు.

# అయ్యన్న పాత్రుడు ఆదివాసీలకు క్షమాపణ చెప్పవలసిందే

### – ఎపిఎజెఎసి సెంట్రల్ కమిటీ మెంబెర్ మడివి నెహ్రూ



**ఎటపాక,మేజర్‌న్యూస్ :** స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 భూ బదలాయింపు నిషేధ చట్టంపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఎసి ఇచ్చిన ఫిబ్రవరి 12 రాష్ట్రవ్యాప్త ఏజెన్సీ బందుకు స్పందించి, 1/70భూ బాధలాయింపు నిషేధ చట్టం తొలగించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, ఆదివాసుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఎసి ధన్యవాదాలు తెలియజేసింది. ఈ మేరకు ఎపిఎజెఎసి సెంట్రల్ కమిటీ మెంబెర్ మడివి నెహ్రూ చింతూరు డివిజన్, ఎటపాక నుండి పత్రికా ప్రకటన విడుదల చేశారు. అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలతో అబద్రతకు లోనైన అదివాసులలో మనోధైర్యం నింపదానికి ఫిబ్రవరి 12 తారికున రాష్ట్రవ్యాప్త ఏజెన్సీ బందుకు అంధ్రప్రదే ఆదివాసి జెఎసి ఫిబ్రవరి మూడవ తారికున ప్రకటించింది.ఆదివాసి జెఎసి పిలుపు అందుకున్న మరుక్షణమే యావత్తు ఆదివాసి సమాజం కదిలివచ్చిన విధానాన్ని ఆదివాసి జెఎసి హర్షం వ్యక్తం చేసింది.అంతేకాకుండా, ఆదివాసులతోపాటు మరికొన్ని రాజకీయ పార్టీలు, అనుబంద సంఘాలు ఉద్యమంలోకి కలిసిరావడం, వాణిజ్య, వ్యాపార, రవాణా సంబందిత వర్గాలు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించడాన్ని ఆదివాసి జెఎసి వృదయపూర్వకంగా స్వాగతిస్తుందని, కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి సహకారంతో ఆదివాసి హక్కుల ఉద్యమాలు భవిష్యత్తులో ఇంకా బలపడాలని ఆశిస్తున్నామన్నారు. అలాగే సూదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో సర్వోన్నతమైన పదవిలో ఉన్న అయ్యన్నపాత్రుడు ఏజెన్సీ ప్రాంతాలలో నాన్ ట్రైబల్స్ (అదివాసేతరులు) బినామీ పేర్లతో పెట్టుబడులు పెడితే ట్రైబల్స్ ఆ భినామీ ఆస్తులు లాగేసుకొంటారని, ఆదివాసుల భూములకు రక్షణగా ఉన్న 1/70 భూ బదలాయింపు నిషేద చట్టంపై కించపరుస్తు చేసిన వ్యాక్యలు సిగ్గుచేటని ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ఆదివాసీ సమాజానికి క్షమాపణలు చెప్పేవరకు ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఎసి నిరసనలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ నెల 24 వ తారీకు నుండి జరిగే అంధ్రప్రదే అసెంబ్లీ సమావేశాలలో హౌజ్‌లోనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేత ఆదివాసులకు క్షమాపణలు చెప్పించాలని, ఆయనను స్పీకర్ పదవి నుండి భర్తరఫ్ చేయాలనీ డిమాండ్ చేశారు. అలానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం డిఎస్సి నోటిఫికేషన్ కు ముందుగా జివో నెంబర్ 3కి బదులు ఏజెన్సీ నియామక చట్టం చేసి ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలతో నియామకాలు చెప్పటాలని కోరారు. అంధ్రప్రదేశ్‌లో తక్షణమే టిఎసి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఆదివాసి హక్కుల విషయంలో రాజకీయపక్షాలు ఆదివాసులకు సహజ ద్రోహులు కాగా, రాజకియ పార్టీలలో ఉన్న మన ఆదివాసి ప్రజాప్రతినిధులు అంతర్గత (పుట్టు) ద్రోహులు. వీరు చేస్తున్న ద్రోహపూరిత చర్యలపై కుడా ఆదివాసి జేఏసీ ఉద్యమం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. 2009లో పాడేరు పర్యటనకు వచ్చిన దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఒకటిన్నర సెంట్లు భూమిని నాన్ ట్రైబల్స్‌కు ఇస్తామని ప్రకటిస్తే అదే వేదికకు అద్యక్షత వహించిన అప్పటి మాజీ ట్రైబల్ వేల్ఫేర్ మినిస్టర్ పసుపులేటి బాలరాజు ప్రతిపాదించారు. అలాగే రాజశేఖర్‌రెడ్డి తనయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక కూడానాన్ ట్రైబల్స్ సెంటున్నర భూమి ఇస్తామని ప్రకటించారు. ఈరోజు అయ్యన్నపాత్రుడు చట్టాన్నే లేకుండా చేయడానికి పూనుకున్నారు. ఇదే వ్యాఖ్యనాలు ఐదేళ్ళ కిందట అరుకు మాజీఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కూడా చేసారు. గత ఎమ్మెల్సి ఎన్నికలకు ముందు ప్రస్తుత వైసిపి ఎమ్మెల్సి కుంబా రవిబాబు ఐదో షెడ్యూల్డ్‌నే మార్చాలని ప్రకటించారు. ఇంకా గిడ్డి ఈశ్వరి లాంటివారు నాన్ ట్రైబల్స్‌కు బహిరంగంగానే కొమ్ము కాస్తూ, వారి అక్రమ ఆస్తులకు బినామిలుగా ఉంటున్నారు. పోలవరం ఎమ్మెల్యే పూర్తిగా గిరిజనతరులకే కొమ్ము కాస్తున్నారు. రంప ఎమ్మెల్యే అదే కోవలో ఉన్నారు.ఆదివాసి హక్కులు కాలరాయడానికి ఏజెన్సీ ప్రాంతాలకు అక్రమంగా చొరబడిన వలసదారులతో అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటామని ప్రకటిస్తున్నారు. అటువంటి వారి కుహన రాజకీయ నాయకులు, బినామిదారులకు ఆదివాసి జెఎసిఎట్టి పరిస్థితుల్లో సహించబోదని హెచ్చరిస్తున్నామన్నారు. ఫిబ్రవరి 12న పిలుపునకు ఆదివాసులు స్పందించిన తీరు ఆదివాసి జెఎసి నాయకత్వానికి ఎంతో భారోశానిచ్చిందని, మున్ముందు మీ సహకారం ఇలాగే కొనసాగాలని కోరుకుంటూ..ఫిబ్రవరి 12 నాటి బందు విజయవంతం చేయడానికి ముందుకు కదిలిన ప్రతి ఆదివాసీ బిడ్డకి పేరు పేరునా ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఎసి హృదయ పూర్వకంగా అభినందనలు, ధన్యవాదాలు తెలియజేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎటపాక ఆదివాసీ జెఎసి ఛైర్మెన్ కుంజా శ్రీను, వైస్ ఛైర్మెన్ తాటి రవి తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం



**అల్లవరం, మేజర్ న్యూస్ :** అల్లవరం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం జరిగింది. అల్లవరం గ్రామంలో జరిగిన కార్యక్రమలో మండల వ్యవసయాధికారి ఎన్.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ వరి పంటలో ఎలుకల నష్ట తీవ్రత తగ్గించుటకు రైతులందరూ సామూహికంగా ఒకేసారి బ్రోమోడియోలోన్ ఎలుకల మందును ఉపయోగించలని అన్నారు. రైతులకు ఉచితంగా బ్రోమోడియోలోన్ ఎలుకల మందును పంపిణీ చేశారు. ఒక ఎకరాకు విషపు ఎరను తయారు చేయుటకు 4 గ్రాముల బ్రోమోడియోలోన్ మందు, 4 గ్రాముల నూనె మరియు 192 గ్రాముల నూకలు కలిపి విషపు ఎరను తయారు చేయాలన్నారు. ఈ విధంగా తయారు చేసిన విషపు ఎరను 10 గ్రాముల చొప్పున పొట్లాలు కట్టి ఎలుకల బోరియల్లో పెట్టాలి అన్నారు. రైతులందరూ సామూహికంగా ఒకేసారి ఉపయోగించి ఎలుకలను సమర్థవంతంగా నిర్మూలించి వరిలో అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మొల్లేటి శుభ గణేష, గ్రామ ఉద్యాన సహాయకులు చింత వెంకట ఈశ్వర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు వాసర్ల సూర్య నారాయణ, పాటి సింహాద్రి, మోహన్ దాస్, నాగ శివ ప్రసాద్, కె.రమేష్ మొదలగువారు పాల్గొన్నారు.

## వెంకన్న అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి గురువారం రావులపాలెంకు చెందిన యమ్.విశ్వనాథం, చంద్రమాణిక్యం దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, స్వామి చరిత్ర గురించి వివరించి దర్శనం చేయించారు. డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు స్వామివారి చిత్రపటం అందించారు.

# కూటమిగా గెలిపిస్తాం

### – ఎమ్మెల్యే నానాజీ





**కాకినాడ రూరల్, మేజర్‌న్యూస్ :** ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరబత్తుల రాజశేఖర్ ను ఈ ప్రభుత్వంలో కూటమిగా గెలిపిస్తామని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. గురువారం కాకినాడ రూరల్ మండలం వలసపాకల గ్రామంలో టీడీపీ కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతు తెలుపుతూ కాకినాడ రూరల్ సమాయత్త సమావేశానికి రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, ఎమ్మెల్యే పంతం నానాజీ మరియు ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, వీర మహిళలు పాల్గొన్నారు.


## కూటమి అభ్యర్థి రాజశేఖరంను గెలిపించాలి



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** కూటమి అభ్యర్థి పేరాబత్తులు రాజశేఖరంను గెలిపిద్దాం అంటూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పిలుపునిచ్చారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని గంగవరం మండలంలో రంపచోడవరం మాజీ శాసన సభ్యులు చిన్నం బాబురమేష్, శీతంశెట్టి వెంకటేశ్వరరావు, వంతల రాజేశ్వరి, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు దాడి రత్నాకర్, స్థానిక కూటమి పార్టీల శ్రేణులతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గంగవరం మండలంలోని జడేరు, గంగవరం, నెల్లిపూడి, మొల్లేరు, పిడత మామిడి గ్రామాలలో ఓటర్లను కలిసి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీష దేవి ఓటర్లకు రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలను వివరించారు. మైదాన ప్రాంతాలతో సమానంగా ఏజెన్సీ ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో స్వర్గీయ నందమూరి తారక రామారావు గురుకుల పాఠశాలలను ప్రారంభించడం జరిగిందని, తద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లోని పిల్లలకు విద్య నేర్చుకునే అవకాశం ఏర్పడిందని తెలిపారు. త్వరలోనే కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు డిఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామని ఓటర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రెసిడెంట్ పాము అర్జున్, రైతు కార్యదర్శి కనిగిరి రాంబాబు, జనసేన ప్రెసిడెంట్ కుంజం సిద్దు, ఎంపీటీసీ పండా ఆదినారాయణ, సీనియర్ నాయకులు బండి శివ వెంకటరమణ, భూపతి దేవ్, మండల జనరల్ సెక్రెటరీ డి భాను ప్రకాష్, బిజెపి పార్టీ మండల అధ్యక్షురాలు పి.లిలాలమ్మ, వెంకటేశ్వర్లు, జనసేన మండల అధ్యక్షులు గవరరాజు, వీరబాబు, రాజు, కూటమి నాయకులు, బూత్ ఏజెంట్లు, బూత్ ఇన్చార్జులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం

### – సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** 516ఇ నేషనల్ హైవే లో రోడ్డుకు ఇరువైపులా భూములు కోల్పోయిన వారికి ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్. కల్పశ్రీ పేర్కొన్నారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో గురువారం రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల, రాజవొమంగి మండలాల తహశీల్దార్లు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, వీఆర్వో లు, ఫారెస్ట్ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, సర్వేయర్లు, ఆర్ అండ్ బి ఇంజనీర్లు తో నేషనల్ హైవే 516ఇ రోడ్డుకు ఇరువైపులా భూములు కోల్పోయిన వారికి ప్యాకేజీ ద్వారా నష్టపరిహారం చెల్లింపులు పై సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ నేషనల్ హైవే 516ఇ రంపచోడవరం మండలం ఐ.పోలవరం గ్రామం నుండి రాజవొమంగి మండలం వరకు రోడ్డుకు ఇరువైపులా నష్టపోయిన గృహాలకు, చెట్లకు, భూములకు ప్యాకేజీ ద్వారా నిబంధనలు ప్రకారం నష్టపరిహారం చెల్లించేందుకు పెండింగ్‌లో ఉన్న కేసులన్నిటికీ నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. నష్టపరిహారానికి పెండింగ్‌లో ఉన్న కేసులను భూమి రాసి ప్రాసెస్ చేయుటకు భూములు కోల్పోయిన బాధితుల బ్యాంకు అకౌంట్ నెంబర్లు తీసుకోవాలన్నారు. రంపచోడవరం డివిజన్ పరిధిలోని నేషనల్ హైవే లో భూములు, ఇండ్లు, చెట్లు కోల్పోయిన బాధితులకు పూర్తిస్థాయిలో పరిశీలించి నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్లు కె. సూర్యనారాయణ, సిహెచ్. శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీధర్, నాలుగు మండలాల మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్‌లు, వీఆర్వోలు, సర్వేయర్లు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఆధార్ ఎన్రోల్మెంట్ ప్రక్రియను వేగవంతం చేయాలి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జిల్లాలో ఆధార్ ఎన్రోల్మెంట్ ప్రక్రియను వేగవంతంచేయాలనిజిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో జె.వెంకటరావు అధ్యక్షతన జిల్లాస్థాయి ఆధార్ కమిటీ సమావేశం నిర్వహించారు. 0–5 సంవత్సరాల వయసు గల పిల్లల ఆధార్ నమోదు, పిల్లల బయో అప్డేట్ చేయడం, తల్లిదండ్రుల అప్డేట్ చేసిన పిల్లల జనన ధృవీకరణ పత్రాల నమోదు, అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు ఆధార్ సంఖ్య నమోదు, గ్రామ/ వార్డు సచివాలయం, పోస్ట్ ఆఫీస్ ఇతర కార్యాలయలలో జరుగుతున్న ఆధార్ ఎన్రోల్మెంట్ వంటి అంశాలపై డీఆర్వో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0–5 సంవత్సరాల వయసు గల పిల్లల 70 వేల మందికి ఆధార్ నమోదు చేయాల్సి ఉందన్నారు. చిన్నారుల ఆధార నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతం చేయాలన్నారు. డీ–యాక్టివేషన్ నివారించడానికి పిల్లల అందరి బయో అప్డేట్‌ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో ఉన్న చిన్నారులందరికీ ఆధార్ సంఖ్య నమోదు చేయాలని ఇందుకు ఆయా గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది అంగన్వాడి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. అదేవిధంగా 15 నుంచి 17 సంవత్సరాల వయస్సులో గల వారి మాండేటరీ బయోమెట్రిక్ పెండింగ్ లేకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లాలో మొత్తం 97ఆధార్ కిట్లు గాను 82 ఆధార్ కిట్లు వివిధ మండలాల్లో పనిచేస్తున్నాయని, మిగిలినవి 15 సాంకేతిక లోపం, కారణంగా వినియోగించడం లేదన్నారు. అదేవిధంగా ప్రతి ఆధార్ కేంద్రంలో వివిధ సేవలకు సంబంధించి వసూలు చేసే ధరల వివరాలతో కూడిన పోస్టర్లను కేంద్రాల వద్ద ప్రదర్శించాలని డీఆర్వో అధికారులకు సూచించారు.సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, జిల్లా ఆధార్ మానేజర్ జీ.గిరిధర్, గ్రామ/వార్డు సచివాలయ సమన్వయకర్త జె.శంకర్, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేశ్, డీపీవో వి.రవి కుమార్, పోస్టల్ పీఆర్ఐపీ కె.ప్రసాద్ రావు, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లా

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 35 మంది పోటీ..

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల్లో గురువారం 8 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి 54 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా వివిధ కారణాలతో 11 మంది అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించగా, మరో 8 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల పోటీల్లో 35మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈనెల 27వ తేదీన పోలింగ్ ప్రక్రియ నిర్వహించబడుతుంది.

**నామినేషన్లు ఉపసంహరించుకున్న అభ్యర్థులు..** 1.గద్దే విజయలక్ష్మి (స్వతంత్ర అభ్యర్థి), 2. డా. కవల నాగేశ్వరరావు(స్వతంత్ర అభ్యర్థి),3.దుర్గారావు పచ్చిగొళ్ల (స్వతంత్ర అభ్యర్థి), 4. పేరాబత్తుల సత్యవాణి(స్వతంత్ర అభ్యర్థి), 5. బాలాజీ గుండుమోలు(స్వతంత్ర అభ్యర్థి), 6. పిల్లంగోళ్ల లీలా నగేష్(స్వతంత్ర అభ్యర్థి), 7. సత్తిరాజు స్వామి(స్వతంత్ర అభ్యర్థి), 8. చక్రపాణి కోండ్రు(స్వతంత్ర అభ్యర్థి),

**పోటీలో ఉన్న అభ్యర్థులు..** 1.పేరాబత్తుల రాజశేఖరం(తెలుగుదేశం), 2. కాట్రు నాగబాబు(తెలుగు నవగర్జన), 3. షేక్ హుస్సేన్(రిఫార్మ్ పార్టీ ఆఫి ఇండియా), 4. కట్టా వేణుగోపాలకృష్ణ(స్వతంత్ర అభ్యర్థి), 5. కాండ్రేగుల నరసింహం(స్వతంత్ర అభ్యర్థి),6. కాళ్లూరి కృష్ణమోహన్(స్వతంత్ర అభ్యర్థి), 7. కుక్కల గోవిందరాజు(స్వతంత్ర అభ్యర్థి),8. కునుకు హేమాకుమారి(స్వతంత్ర అభ్యర్థి), 9. కైలా లావణ్య(స్వతంత్ర అభ్యర్థి) 10.గౌతం బాబు కొల్లు(స్వతంత్ర అభ్యర్థి), 11.చిక్కాల దుర్గారావు(స్వతంత్ర అభ్యర్థి), 12. తాళ్లూరి రమేష్(స్వతంత్ర అభ్యర్థి), 13. దత్తాత్రేయ నోరి(స్వతంత్ర అభ్యర్థి), 14. దిడ్ల వీరరాఘవులు(డివి రాఘవులు) (స్వతంత్ర అభ్యర్థి), 15. దొరబాబు యాళ్ల (స్వతంత్ర అభ్యర్థి), 16. నీతిపూడి సత్యనారాయణ(స్వతంత్ర అభ్యర్థి), 17. పినిపే నాగభూషణవర్మ (స్వతంత్ర అభ్యర్థి), 18. పిప్పళ్ల సుప్రజ(స్వతంత్ర అభ్యర్థి),
19. పేపకాయల రాజేంద్ర(శుభ) (స్వతంత్ర అభ్యర్థి), 20. బొడ్డు శ్రీనివాసరావు(స్వతంత్ర అభ్యర్థి),21. బొమ్మనబోయిన విఎస్ఆర్ మూర్తి(స్వతంత్ర అభ్యర్థి), 22. బొమ్మిడి సన్నిరాజ్(స్వతంత్ర అభ్యర్థి), 23.బండారు రామమోహన్ రావు(స్వతంత్ర అభ్యర్థి), 24. భీమేశ్వరరావు చిక్కా(స్వతంత్ర అభ్యర్థి), 25. మాకే దేవిప్రసాద్(స్వతంత్ర అభ్యర్థి), 26. మెర్ల శాస్త్రులు (స్వతంత్ర అభ్యర్థి), 27.మోకన అంబేద్కర్ (స్వతంత్ర అభ్యర్థి), 28.రాజపూడి (స్వతంత్ర అభ్యర్థి), 29. జెటి రామారావు(స్వతంత్ర అభ్యర్థి),30.రేవులగడ్డ మహేష్‌బాబు(స్వతంత్ర అభ్యర్థి),31.వానపల్లి శివగణేష్ (స్వతంత్ర అభ్యర్థి),32. యం.శ్రీనివాసరావు( స్వతంత్ర అభ్యర్థి), 33. శ్రీనివాస్ విష్ణువఝల(స్వతంత్ర అభ్యర్థి), 34. జి.వి. సుందర్(స్వతంత్ర అభ్యర్థి), 35. హాసన్ షరీఫ్ అభ్యర్థులు తుది పోటీలో ఉన్నారు.

# పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలి

### – ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గణేష్ కుమార్, వాసిరెడ్డి రాంబాబు



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ వి.గణేష్ కుమార్, నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు లు అన్నారు. గురువారం మండలంలోని పేరవరం గ్రామంలో జరిగిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పట్టభద్రుల వద్దకు వెళ్లి తెలుగుదేశం, జనసేన, భాజపా కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, క్లస్టర్ ఇంఛార్జి, మాజీ సర్పంచ్ ముళ్ళపూడి భాస్కరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీహరి, బూత్ కన్వీనర్లు చిటికెన సత్యానారాయణ, మహేష్, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ధ్రువపత్రాల రీవెరిఫికేషన్ చింతూరులో ఏర్పాటు చేయాలి..

### – ఉప సర్పంచ్ కందుకూరి స్వర్ణ



**ఎటపాక,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం ద్వారా పింఛన్ పొం దుతున్న విక లాంగుల రీవెరిఫికేషన్ చింతూరులోనే చేపట్టాలని గన్నవరం ఉప సర్పంచ్ కందుకూరి స్వర్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ సంధర్బంగా ఆమె మాట్లడుతూ దివ్యంగుల ద్రువ పాత్రల రీ వెరిఫికేషన్ కోసం వారిని పాడేరు, రంపచోడవరం ఆసుపత్రులకు వెళ్లాలని తేదీలు ఇస్తున్నారని, జిల్లా కేంద్రానికి, డివిజన్ కేంద్రాల్లోకి వెళ్ళాలంటే సుమారు 400 కిలోమీటర్లు వెళ్ళవలసి వస్తుందని, అందుకు చాలా ఖర్చుతో కూడినదని, అంతేకాకుండా రవాణా సౌకర్యం కుడా సరిగ్గా లేకుండా పోయిందన్నారు. అంత దూరం వెళ్లడానికి దివ్యంగులు ఇబ్బంది పడుతున్నారు కావున వీరందరిని చింతూరులో స్పెషల్ క్యాంప్ ఏర్పాటు చేసి వారిని చింతూరులోనే రీవెరిఫికేషన్ చేసుకునే విధంగా చూడాలన్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా రంపచోడవరం జిల్లా కానీ, ఈ నాలుగు మండలాలకు కలిపి ఒక ప్రత్యేక జిల్లా చేయాలని డిమాండ్ చేశారు.

## విధులు నిర్వహణపై పోలీసు సిబ్బందికి శిక్షణ

**– డి.ఎస్.పి శ్రీహరి రాజు సిబ్బందికి పలు సూచనలు**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో, గురువారం డివిజన్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ లకు సంబంధించిన కంప్యూటర్ ఆపరేటర్లు, కోర్టు కానిస్టేబుల్స్ అందరికీ శిక్షణ తరగతిని నిర్వహిం చడం జరిగినది. దీనిలో భాగంగా కంప్యూటర్ల నిర్వహణ, ప్రజా ఫిర్యాదులు పరిష్కారంలో మెలకువలను చర్చించి ప్రజలకు మెరుగైన సేవలు అందించుటలో సూచనలు, సలహాలు డి.ఎస్.పి శ్రీహరి రాజు ఇవ్వడం జరిగినది ఈ శిక్షణ తరగతులలో సబ్ ఇన్స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యుత్ సరఫరా అంతరాయం

**పెరవలి, మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 14 వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు 33/11 పెరవలి విద్యుత్ సబ్ స్టేషన్ వార్షిక మర్మత్తుల మరియు మైంటెనెన్సు పనులు నిమిత్తం పెరవలి,ముక్కామల,అజ్జరం ,కాకరపర్రు,తీపర్రు,ఖండవల్లి, కొత్తపల్లి, నల్లకులవారి పాలెం, కాపవరం గ్రామముల పరిధిలో గృహ,వాణిజ్య, పరిశ్రమ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయము కలుగుతుంది. కావున వినియోగదారులు సహకరించాలని ఎన్. నారాయణఅప్పారావుఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ఏ.పి.ఇ.పి.డి.సి.ఎల్ వారు వినియోగదారులకు విజ్ఞప్తిచేశారు.అదేవిదంగా 33/11 కె.వి మల్లేశ్వరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి లోని అన్నవరపుపాడు, మల్లేశ్వరం,కడింపాడు ,పిట్టలవేమవరం, గ్రామములకు 33 కెవి పెనుగొండ– పెరవలి విద్యుత్ లైన్ ట్రీ కటింగ్ నిమిత్తం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగును. వ్యవసాయ 3 ఫేస్ విద్యుత్ ఉదయం 4 గంటల నుండి 7 గంటల వరకు, మధ్యాహ్నం 1 గంట నుండి 6 గంటల వరకు సరఫరా చేయబడును.కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసినదిగా కోరుచున్నాము అన్నారు.

# వాహన ప్రమాదాలు నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం

**– ప్రజల్లో అవగాహన కలిగించేందుకు రహదారి భద్రతపై ప్రచారం నిర్వహిస్తున్నాం**

**– జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా గురువారం కార్లు, ఆటోలు, మోటార్ సైకిళ్ళుతో కూడిన కంబైన్డ్ వాహనాలతో ర్యాలీ**

**– జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** వాహన ప్రమాదాలు నివారించేందుకు ముందస్తు జాగ్ర త్తలు తప్పనిసరిగా పాటించాలని, భద్రతా మాసోత్సవాలు సందర్భంగా జిల్లాలో అన్ని వర్గాలను కలుపుతూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్, ఎస్. చిన్న రాముడు అన్నారు. గురువారం ఉదయం ఆర్ట్స్ కళాశాల ఆవరణ లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా కార్లు, ఆటో లు, మోటార్ సైకిళ్ళుతో కూడి న కంబైన్డ్ వాహనాలతో ర్యాలీ ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, అడిషనల్ ఎ స్పీ, ఏవి సుబ్బారావు, జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు విధిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్ ధరించక పో వడం, ట్రాఫిక్ రూల్స్ పాటించ కపోవడం వల్ల ఏటా చాలా మంది



వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజల్లో అవగాహన పెంచేందుకు రవాణాశాఖ గత నెల జనవరి నెల నుండి ఫిబ్రవరి 15 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ట్రాఫిక్ రూల్సను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగ్గా పాటించాలన్నారు. ద్విచక్రవాహనం నడిపేటపుడు హెల్మెట్, కారు నడిపేటపుడు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు.
ఈ సందర్భంగా ఎడిషనల్ ఎస్పీ ఏవి సుబ్బరాజు మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహన ప్రయాణ సమయంలో చేసే చిన్న పొంపాటు వల్ల మీతోపాటు ఇతరులు కూడా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్ మాట్లాడుతూ వాహన ప్రమాదాలు నివారించేందుకు ప్రభుత్వం అనేక అవగాహన కార్యక్రమా లు రూపొంది స్తోందని అన్నా రు. ప్రజల్లో చైతన్యం రావాలనే అవగాహన ర్యాలీలు ఏర్పా టు చేసినట్లు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. మితిమీరిన వేగం తో, వాహనాల్లో నిర్దేశించుకున్న సంఖ్య కంటే ఎక్కువగా మితిమీరిన ప్రయాణికులతో ప్రయాణించడం చట్టరిత్యా నేరం అన్నారు. ఇటువంటి సందర్భాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగితే ఎటువంటి నష్ట పరిహారం కూడా అందే అవకాశం లేదని, మనం ఇంటి వద్ద బయలుదేరే సమయంలో తిరిగి ఇంటికి క్షేమంగా చేరుకోవడానికి భద్రత నిబంధనలు ఖచ్చితం గా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ మోటార్ వెహికల్స్ సిహెచ్. సంపత్ కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర రావు, అసిస్టెంట్ మోటార్ వెహిక ల్ ఇన్స్పెక్టర్స్, జి రాధికా దేవి, పి. వి. వి. డి. సాయి కుమార్, రోడ్ సేఫ్టీ మెడికల్ ఆఫీసర్, డాక్టర్ పి.మాధురి, పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనదారులు, క్యాబ్, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘించిన వైన్ షాపులపై మెరుపు దాడులు..

**– కేసులు నమోదు**





**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశములతో, కాకినాడ ఎస్డిపివో ఎఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో రాత్రి 10 గంటలు దాటిన తరువాత తెరిచి ఉన్న వైన్ షాపులపై ప్రత్యేక బృందాలతో ఆకస్మిక దాడులు నిర్వహించారు. కాకినాడ సిటీలోని 1వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 4 షాపులు, 3వ పట్టణ పిఎస్ పరిధిలో 2 షాప్ లు మరియు సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో 2 షాపులు మొత్తం 8 బ్రాందీ షాపులపై దాడి చేసి కేసులు నమోదు చేశారు.

## మహిళల భద్రత బలోపేతం కోసం సపోర్ట్ సెంటర్

**– ప్రారంభించిన జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్**



ఏలూరు,మేజర్ న్యూస్: జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ మహిళా పోలీస్ స్టేషన్లో సపోర్ట్ సెంటర్ ను గురువారం ప్రారంభించారు. మహిళల భద్రతను మరింత బలోపేతం చేయడానికి, మహిళా పోలీస్ స్టేషన్లో సపోర్ట్ సెంటర్ను ప్రారంభించడం జరిగింది. ఈ సెంటర్లో భూమిక ఉమెన్ కలెక్టివ్ ప్రతినిధులు మహిళా,సమస్యలను నేరుగా తెలియజేసి,అవసరమైన సహాయం పొందవచ్చు.ఈ సందర్భంగా,జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ మహిళల భద్రతే మన లక్ష్యం. వారి భద్రతకు అనుగుణంగా పోలీసు సిబ్బంది పని చేయాలి అని తెలిపారు. మహిళలు తమ సమస్యలను సపోర్ట్ సెంటర్లో నేరుగా తెలియజేయవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో, టోల్‌ఫ్రీ నంబర్లు 112 లేదా 1098 లేదా 1930లకు కాల్ చేయవచ్చు. ఈ సెంటర్ ద్వారా మహిళలకు అవసరమైన న్యాయం చేయడానికి కృషి చేయబడుతుంది.మీ సహకారం మన సమాజాన్ని సురక్షితంగా ఉంచడంలో కీలకమైనది. ఈ కార్యక్రమంలో డిఎస్పి డి శ్రావణ్ కుమార్, మహిళ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ యమ్ సుబ్బారావు మహిళా పోలీస్ స్టేషన్ మహిళా ఎస్సై కాంతి ప్రియ,వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ,ఇన్స్పెక్టర్ వై వి రమణ,వన్ టౌన్ ఎస్ఐ మదీనా భాష,2 టౌన్ ఎస్ఐ రామకృష్ణ, భూమిక మహిళల సామూహిక చీఫ్ ఫంక్షనరీ,కొండవేటి సత్యవతి,కౌన్సిలర్ నాగా సుజీ డాక్టర్ వి మనోహరి, గ్రామా డీప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఎ లక్ష్మి, ఆర్టీడి జిల్లా న్యాయమూర్తి,మదావి లత, ఆశా జ్యోతి అసమమ్,నిరామాలా,వన్ స్టాప్ సెంటర్ కోఆర్డినేటర్ మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీగా పేరాబత్తులను గెలిపించాలి - ఎమ్మెల్యే నానాజీ





కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : కూటమి తరపున శాసనమండలికి పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ సౌమ్యుడని, నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసే మనస్తత్వం ఉన్న వ్యక్తి కాబట్టి ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ మొదటి ప్రాధాన్యత ఓటు ఆయనకు వేసి గెలిపించాలని కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ పేర్కొన్నారు. రమణయ్యపేటలో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్కు మద్దతుగా జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఒక్కరు గుర్తించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నోటిఫికేషన్ విడుదల చేసి 16,437 ఉపాధ్యాయులను నియమించనుందని అన్నారు. కాకినాడ గ్రామీణ నియోజకవర్గ అభివృద్ధికి ఒక ప్రణాళికతో ముందుకు వెళుతున్నానని అన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని అన్నారు. గ్రామంలో కోటి యాభై లక్షల రూపాయలతో మంచినీటి సౌకర్యాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. పిఠాపురం రోడ్డు– పనసపాడు లింకు రోడ్డును అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఏపీఎస్పీ జిల్లా పరిషత్ పాఠశాలను కోటి రూపాయలతో అభివృద్ధి చేయ నున్నట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో సిసి రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధులతో రెండు కోట్ల రూపాయలతో త్వరలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధిని గుర్తించి పేరాబత్తుల రాజశేఖర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే నానాజీ కోరారు. మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పంతం నానాజీని, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వాసిరెడ్డి యేసుదాసు, సీతయ్య దొర, శ్రీనివాస బాబా, నురుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, నగరపాలక సంస్థ మాజీ వైస్ చైర్మన్ కాలా సత్తిబాబు, నాగమణి, బిజెపి నాయకులు రంబాల వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు మాదారపు తాతాజీ, పుల్ల శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ రాయుడు అనిల్, తాటికాయల వీరబాబు, కెవిపి బాలాజీ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్ వాడి కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై శిక్షణా



**భీమడోలు,మేజర్ న్యూస్:** అంగన్ వాడి కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను మరింత సమర్థవంతంగా అందజేసేందుకు, అధునీకరించిన సేవల పట్ల అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న పోషన్ బి పఠాన్‌బి శిక్షణా తరగతుల సేవలను కార్యకర్తలు సద్వినియోగపరుచుకోవాలని, ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్ ఇన్చార్జి సిడిపిఓ షెహనాజ్ బేగం,పూళ్ళ సెక్టార్ పర్యవేక్షకులు నూర్జహాన్ బేగం కోరారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మండలానికి చెందిన 64 మంది అంగన్వాడీ కార్యకర్తలకు గుండుగొలను,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు వేదికగా మూడు రోజులు పాటు కొనసాగే శిక్షణా తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్లుగా షహనాజ్ బేగం, నూర్జహాన్ బేగం వ్యవహరించారు. భీమడోలు వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నూర్జహాన్ బేగం మాట్లాడుతూ శిక్షణా తరగతులలో అంగన్వాడీ కార్యకర్తలకు ప్రారంభ ప్రేరణ,ప్రారంభ బాల్య సంరక్షణ విద్య,పాఠ్యాంశాల అంశాల బోధనా విధానాలు,కార్యకర్తలకు సదరు అంశాల పట్ల అవగాహన కల్పించుట,సామర్థ్యాలను అభివృద్ధి చేయుట, సంఖ్యాశాస్త్రం ఇతర అంశాల గురించి వివరించుట, అమలు కానున్న పోక్షణ్ -2,చిన్నారుల ఆహార పద్ధతులు, పోషకాహార విలువల పట్ల అవగాహన కల్పించడం వంటి అంశాలు ఉంటాయన్నారు. గురువారం ప్రారంభమైన శిక్షణా తరగతుల్లో కార్యకర్తలకు 9 సెక్షన్లలో వివిధ అంశాల పట్ల అవగాహన కల్పించటం జరిగిందని తెలిపారు. మండలానికి చెందిన పలువురు అధికారులు కొనసాగుతున్న శిక్షణా తరగతులను పరిశీలించారు. తగు సూచనలు అందజేశారు.

# ఏజెన్సీలో పీసా కమిటీ సభ్యులకు శిక్షణ






రంపచోడవరం, మేజర్ న్యూస్ : రంపచోడవరం మండలంలో పీసా కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం, ఎంఆర్ సి భవనంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు. గురువారం జరిగిన పీసా ట్రైనింగ్ క్లాసులో పీసా కార్యదర్శి, ఉపాధ్యక్షులు, వార్డ్ మెంబర్లు ఎస్ హెచ్ జి గ్రూప్ లీడర్స్ లకు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో కోర్సు డైరెక్టర్ గా రంపచోడవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుండం శ్రీనువాసు దొర, అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్గా ఇవోపిఆర్ అండ్ ఆర్డి కె.యు.ఎస్.అర్. పద్మజ వ్యవహరించారు. ఎంఓటిలుగా ఎం.మహేశ్వర రావు, పిఎస్ బందపల్లి ఎస్కె భాష, పి ఎస్ బూసిగూడెం లక్ష్మీ పిఎస్ రంప కె.శాంతి ప్రసన్న పిఎస్ ఫోక్స్ పేట శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు, పీసా సెక్రటర్లు, వైస్ ప్రెసిడెంట్ ఎస్‌హెచ్‌జి మెంబర్లు, బొలగొండ, బూసిగూడెం, వాడపల్లి, తాటివాడ, మడిచెర్ల గ్రామాల నుంచి మొత్తం189 మంది సభ్యులకు శిక్షణ ఇచ్చినట్లు ఎంపిడివో సుండం శ్రీనివాసు దొర తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక పరిశీలకులుగా కాకినాడ డి పి ఆర్ సి నుండి పి. వెంకటేశ్వరరావు హాజరయ్యారు.
కోడి మాంసం అమ్మకాలపై నిషేధం ఉభయగోదావరి జిల్లాలలో బర్డ్ ఫ్లూ వైరస్ కారణంగా పెద్ద మొత్తంలో కోళ్లు చనిపోతున్న కారణంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐటిడిఏ రంపచోడవరం వారు సబ్ కలెక్టర్ రంపచోడవరం వారి ఆదేశాలు ప్రకారం మండలం పరిధిలో ఎక్కడా కోడి మాంసం అమ్మకాలు కోడిగుడ్లు అమ్మకాలు తాత్కాలికంగా నిలుపుదల చేయవలసినదిగా ఆదేశించారని రంపచోడవరం ఎంపిడివో సుండం శ్రీనివాసు దొర తెలిపారు. రంపచోడవరం మండలం పరిధిలోని అన్ని గ్రామాలలో కోడి మాంసం వ్యాపారస్తులు ప్రజలు ఈవిషయం గమనించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం వారు తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు తాత్కాలికంగా గ్రామాలలో కోడి మాంసం, కోడిగుడ్లు అమ్మకాలు చేయరాదని, ప్రజలు సహకరించి వినియోగం తగ్గించు కోవాలని కోరారు.

## రైతు విశిష్ట సంఖ్య నమోదు : ఏవో చెన్నారావు



**ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్:** మండలంలోని రైతులకు కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట నిర్దిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేస్తున్నారని,11 అంకెలు ఉండే ఈవిశిష్ట గుర్తింపు సంఖ్య ప్రభుత్వ పథకాల లబ్ధి పొందేందుకు చాలా అవసరం అని మండల వ్యవసాయశాఖా ధికారి పలగాని చెన్నారావు తెలిపారు.ఈ నేపథ్యంలో రైతులు తమ వివరాలను రైతు సేవా కేంద్రంలో నమోదుచేయించుకుని ఈవిశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని, రైతన్నల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు, సేవలు అమలు చేస్తున్నాయని,ఈ పథకాలు అర్హులైన రైతులకు లబ్ధి చేకూర్చేలా ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట నిర్దిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తున్నారని, మండలంలోని రైతు సేవా కేంద్రంలో ఇప్పటికే అన్నదాతల వివరాల నమోదు ప్రక్రియ మొదలైందని,ఇప్పటికే 2200 మంది రైతుల వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం స్వంత భూమి ఉన్న ప్రతి రైతు అర్హుడేనని,రైతులు తమ ఆధార్ కార్డు, ఆధార్ కార్డు లింక్ అయిన ఫోన్ నెంబరు, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకొని రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి అక్కడ ఉన్న సిబ్బందిని సంప్రదించాలని,రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతుల సమక్షంలోనే ఈ విశిష్ట సంఖ్య కోసం కంప్యూటర్లో నమోదు చేస్తారని,నిర్దేశిత పోర్టల్ లో రైతు భూమి వివరాలు ఆధార్ కార్డు ఫోన్ నెంబర్ వివరాలు నమోదు చేస్తారని అన్నారు.ఈ నమోదు పూర్తికాగానే రైతుల మొబైల్ ఫోన్ కు ఓటిపి వస్తుందని, ఈ ఓటీపీని రైతు సేవ కేంద్రం సిబ్బందికి తెలియచేస్తే నమోదు ప్రక్రియ పూర్తి అయ్యి, రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేరాబత్తుల గెలుపే పార్టీ శ్రేణుల లక్ష్యం

**– ఆలమూరు, రావులపాలెం మండల తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే సత్యానందరావు**








**రావులపాలెం/ఆలమూరు, మేజర్ న్యూస్ :** ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్డీయే అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపే తెలుగుదేశం పార్టీ శ్రేణుల లక్ష్యం అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు గ్రామం మల్లూరి పాపయ్య టౌన్ హాల్లో జరిగిన మండల తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మరియు రావులపాలెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన మండల తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి.వి.గణేష్ కుమార్, యువ నాయకులు బండారు సంజీవ్, ఆకుల రామకృష్ణ పాల్గొన్న ఈ కార్యక్రమంలో సత్యానందరావు మాట్లాడుతూ మన ప్రియతమ నాయకులు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల ప్రకారం కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ను గెలిపించుకోవడం కోసం, పట్టభద్రుల ఓట్లను పొందడం కోసం విశిష్ట కృషి చేయాలని సూచించారు. ప్రతి ఒక్క పట్టభద్రుల వద్దకు వెళ్లి పేరాబత్తులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేసి కొత్తపేట నియోజకవర్గంలో భారీ మెజారిటీ తీసుకురావాలని ఎమ్మెల్యే సత్యానందరావు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## భద్రాద్రి సీతారామాలయ దివ్య రథోత్సవ పాదయాత్ర





**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** ప్రజల్లో ధార్మిక చైతన్యాన్ని నింపుటకు గత14 సంవత్సరాలుగా శ్రీ భద్రాద్రి సీతా రామాలయ దివ్య రథోత్సవ పాదయాత్ర కాకినాడ నుంచి భద్రాచలం కి ప్రారంభించమని అందులో భాగంగా 250 మంది భక్తులతో కాకినాడ నుంచి భద్రాచలం పాదయాత్రకు చేసుకుంటూ గురువారం లక్ష్మీపురం చేరుకున్నామని శ్రీశ్రీశ్రీ వాసుదేవ గురు స్వామీజీ అన్నారు. దారి పొడవునా దాతలు భోజన వసతి అల్పాహార వసతి చల్లటి మజ్జిగ మంచినీళ్లు అందిస్తూ స్వాగతం చెబుతున్నారని వారందరికీ ఆ శ్రీరాముని దివ్య ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. 17వ తేదీకి భద్రాచలం చేరుకుంటామని అన్నారు. మండలంలోని లక్ష్మీపురం పాదయాత్ర చేరుకోగానే విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తనికెళ్ళ సత్య రవికుమార్ పాదయాత్రగా వచ్చే స్వాములకు స్వాగతం పలికారు. రామ భక్తులు గ్రామ పెద్దలు కొల్లూరు రాంబాబు పాదయాత్రలకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారని వారు వారి కుటుంబ సభ్యులు శ్రీరాముడు దయతో జీవించాలని దీవించారు. జీలుగుమిల్లిలో కక్కిరాల అప్పారావు సాయంకాలం టీ మజ్జిగ స్నాక్స్ ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. రాత్రి అశ్వరావుపేటలో బస చేస్తామని శ్రీశ్రీశ్రీ వాసుదేవ గురు స్వామీజీ అన్నారు. కాకినాడ నుంచి ఎనిమిదో తేదీన బయలుదేరినామని స్వామివారి విగ్రహాలతో కూడిన రథాన్ని భక్తులను తాళ్లతో లాగుకుంటూ భద్రాచలం చేరుకుంటామని స్వామీజీ చెప్పారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి రాంబాబు, అక్కిశెట్టి ప్రసాదు, కంచర్ల పాండురంగారావు, కక్కిరాల అప్పారావు, యనమల సత్యనారాయణ, వేదుల జనార్ధన రావు, కకిరాల మురళి, రాపాక గోపాలరావు, కొత్తూరు మోహన్ రావు, బొంతు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.